సాక్షి జగిత్యాల

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



బో'నమో' పోచమ్మ

కోరుట్ల: పట్టణంలోని ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో గురువారం ఐదు చేతుల పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు.



సీఎంకు 'విప్' అడ్లూరి కృతజ్ఞతలు

ధర్మపురి/గొల్లపల్లి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
29.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

అపరిశుభ్రతతోనే వ్యాధులు



నీటి ట్యాంక్ వద్ద డెప్యూటీ డీఎంహెచ్‌వో

కథలాపూర్: ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు వ్యాపిస్తాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం పర్యటించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్ రావడంతో బాధితుడి ఇంటిని పరిశీలించారు. నీటి నిలవ్వలు, అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో ప్రజలకు పలు సూచనలిచ్చారు. ఇళ్లముందు అపరిశుభ్ర వాతావరణం ఉంటే యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శంకర్, వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్లు శ్రీధర్, భూషణ్, కార్యదర్శి సాయినాథ్, ఆశా వర్కర్లు ఉన్నారు.

జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా లత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ అధికారిగా లత నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ప్రతాప్‌సింగ్ మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ ఉద్యాన శాఖలో పనిచేస్తున్న లతను నియమించారు. జగిత్యాల నియోజక వర్గ అధికారి స్పందనను నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న స్వాతిని నియమించారు. ధర్మపురి నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారిగా దేవ ప్రసాద్, కోరుట్ల నియోజకవర్గం ఉద్యానశాఖ అధికారిగా శ్రీనివాస్‌ను నియమించారు.

పంచాయతీ ఎన్నికల శిక్షణకు ఐదుగురు

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే శిక్షణకు జిల్లా నుంచి డీపీఎం, నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను ఎంపిక చేశారు. డీపీఎం గాలిపల్లి సాంబశివ, కంప్యూటర్ ఆపరేటర్లు ఎస్.సాయినరేశ్, కర్నె అనిల్‌కుమార్, మ్యాడారం అనిల్‌కుమార్, అల్లం రాంమోహన్ శిక్షణకు వెళ్లనున్నారు.

జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలు

జగిత్యాలక్రైం: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 30 వరకు పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హర్షం

జగిత్యాలటౌన్: ఎస్సీలను వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటిస్తూ అప్పటి యూపీఏ ప్రభుత్వానికి నివేదించారని, ఆ సమయంలో యూపీఏ సర్కారు చట్టం చేసిందని పేర్కొన్నారు. దానిపై కొందరు సుప్రీంకోర్టులో సవాలు చేశారని, దీంతో సర్కారు ఉషామెహ్రా కమిషన్ వేసిందని గుర్తు చేశారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టులో రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదిని నియమించి వర్గీకరణకు అనుకూలంగా వాదనలు వినిపించారని తెలిపారు. వర్గీకరణ తీర్పుతో మాదిగ వర్గానికి ఉపశమనం కలిగించిందనిపేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కొండగట్టు ఆలయ ఈవో



ఈవో రామకృష్ణతో అర్చకులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయ ఈవోగా డి.రామకృష్ణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఈవోగా ఉన్న చంద్రశేఖర్ మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రామకృష్ణరావు ముందుగా ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్ శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఎస్సారెస్పీపైనే ఆశలు

- ప్రాజెక్టులోకి కొనసాగుతున్న ఇన్ ఫ్లో
- 36 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- పంటలకు నీరివ్వాలంటున్న రైతులు



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మొన్నటివరకు ప్రాజెక్టులో నీటి నిల్వలు అంతంత మాత్రమేగానే ఉన్నా.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రవాహం కొనసాగుతోంది. దీంతో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 90 టీఎంసీలకు గాను ప్రస్తుతం 36టీఎంసీలకు చేరింది. దీంతో పంటలకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి. ఇందులో వరి పంటనే దాదాపు 3లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. వరికి నీటి అవసరం ఎక్కువ. ప్రస్తుతం వ్యవసాయ బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితో నార్లు పోశారు. వర్షాలు పుష్కలంగా లేకపోవడంతో పొలాలను నాట్లకు సిద్ధం చేయలేకపోతున్నారు. ఇక లక్ష న్నర ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న, పసుపు వంటి పంటలకు డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్నారు. ఆరుతడి పంటలకు అప్పుడప్పుడు సాగునీటితోపాటు వర్షం కురిస్తే సరిపోతుంది. వరికి నీటిని నిరంతరం అందించాల్సి ఉంటుంది.

నీటి విడుదలపై అన్నదాతల ఆశ

ఎస్సారెస్పీ నుంచి వానాకాలం పంటలకు నీరు అందేది కాదు. యాసంగి పంటలకు మాత్రమే ఇచ్చేవారు. దీంతో సాగునీటి కోసం రైతులు ఏటా ఆందోళనలకు దిగేవారు. కాళేశ్వరం నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా ప్రాజెక్టును నింపితే అప్పుడు నీటిని విడుదల చేసేవారు. నీటి నిల్వను బట్టి ఆన్, ఆఫ్ పద్ధతిలో నీరు వదిలేవారు. ఫలితంగా ప్రత్యక్షంగా నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల ఎకరాలకు.. పరోక్షంగా మరో ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జిల్లామొత్తం (ఒకటి, రెండు మండలాలు మినహా) ఆయకట్టు పరిధిలోనే ఉంది. కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల మండలాలకు వరదకాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 36 టీఎంసీలకు చేరడంతో సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఇప్పటికే సారంగాపూర్, ధర్మపురి, ఇబ్రహీంపట్నం మండలాల రైతులు వానాకాలం పంటలకు నీరు విడుదల చేయాలని ప్రజాప్రతినిధుల ద్వారా ఎస్సారెస్పీ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

సగం కూడా నిండని ఎస్సారెస్పీ

ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుతం 1076.5 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీ (గతంలో 90.3 టీఎంసీ)లకు ప్రస్తుతం 36.269 టీఎంసీల నిల్వ ఉంది. జూన్ ఒకటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.133 టీఎంసీల నీరు చేరింది. గతేడాది ఇదే సమయానికి 76.894 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టులోకి 8,278 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుండగా.. 664 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సరస్వతి కాలువకు 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కింద తాగు నీటికి జగిత్యాల, కోరుట్లకు 61క్యూసెక్కులు, అదిలాబాద్, నిర్మల్‌కు 63 క్యూసెక్కులు,ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డికి 107 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నీటి కోసం ఎదురుచూస్తున్నాం



ఎస్సారెస్పీ ద్వారా జిల్లాకే ఎక్కువ నీరు అందుతుంది. ప్రాజెక్టు నీరు రాకపోతే పంటలు పండటం కష్టం. చాలామంది నాట్లు వేసి నీటి కోసం ఎదురుచూస్తున్నారు. నీటి విడుదలపై ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– వేముల కరుణాకర్, ధర్మపురి(మం)

విడుదల చేయాలి



ఆన్, ఆఫ్ పద్ధతిలో నీరు విడుదల చేయాలి. బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితో నాట్లు వేసుకున్నాం. బావుల్లో సరిపడా నీరు లేదు. వారానికోసారి ఆన్, ఆఫ్ పద్ధతిలో విడుదల చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– నక్కల తిరుపతి రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి

ఉద్యోగుల సొమ్ము చేతికందేనా..?

- వైద్య విధాన పరిషత్‌లో బదిలీలు
- విచారణ అధికారి డీసీహెచ్‌ఎస్ కూడా..
- అయోమయంలో బాధిత ఉద్యోగులు



విచారణ అధికారికి విన్నవిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

జగిత్యాల: జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల జీపీఎఫ్, సీపీఎస్ ఏరియర్స్, డీఏ సొమ్మును ఆ శాఖలోని అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సొంత ఖాతాలోకి మళ్లించుకున్న విషయం తెల్సిందే. నాలుగేళ్లుగా వారి డబ్బు స్వాహా చేశాడు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో ఉద్యోగులందరూ అలర్ట్ అయి తమ డబ్బు కోసం అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. సొమ్మును సొంత ఖాతాకు మళ్లించుకున్న సదరు ఉద్యోగి సుమారు రూ.1.20 కోట్ల వరకు చెల్లించినట్లు సమాచారం. అయితే మొత్తం సొమ్ము ఇంకా భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది.

బదిలీల గుబులు

ఇటీవల వైద్య విధాన పరిషత్‌లో బదిలీలు చోటుచేసుకున్నాయి. డీసీహెచ్‌ఎస్ అధికారి సుదక్షిణదేవి మంచిర్యాలకు బదిలీ అయ్యారు. ఆ విభాగంలో ఉన్న అధికారులు కూడా బదిలీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. విచారణ అధికారులు బదిలీ అయితే ఉద్యోగుల డబ్బు మళ్లింపు కథ కొలిక్కి వచ్చేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్య విధాన పరిషత్‌లో జరిగిన కుంభకోణానికి సంబంధించి విచారణ అధికారిగా బాన్సువాడ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను నియమించారు. ఆయన కూడా బదిలీ అయినట్లు తెలిసింది. ఈ కుంభకోణం బయటకు రాగా.. జగిత్యాలలోని మాతాశిశుసంక్షేమ కేంద్రంలో ఉన్న డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఉన్న రికార్డులన్నింటినీ పరిశీలించారు. హైదరాబాద్ నుంచి మరో ఇద్దరు అధికారులు వచ్చి వెరిఫికేషన్ చేశారు. వారి నివేదిక ప్రకారం.. అప్పటి రికార్డు అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. సుమారు రూ.4 కోట్లకు పైగా జరిగిన కుంభకోణంలో రూ.కోటి వరకు రికవరీ అయ్యాయి. ఉద్యోగులు బదిలీలు అయితే మిగతా డబ్బులు కొలిక్కి వచ్చేదెలా అనేది సంశయంగా మారింది.

విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. విద్యార్థికి క్లాస్‌రూమ్‌లో ఎలా బోధిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హెచ్‌ఎంల పరిధిలో ఉన్న స్కూళ్లను విజిట్ చేయాలని ఆదేశించారు. పిల్లల ప్రగతి, ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్ సబ్జెక్టులపై పిల్లలకు చదవడం, రాయడంపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. అన్ని స్కూళ్లలో బేసిక్‌పరీక్షలు నిర్వహించాలన్నారు. స్కూల్ ప్రతి టీచర్స్, ప్రిన్సిపల్స్ సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించండి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న బోగ శ్రావణి

జగిత్యాలటౌన్: చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించాలని, రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ హ్యాండ్లూం టెక్నాలజీని స్థాపించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి కోరారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి గురువారం కేంద్ర జౌళి, టెక్స్‌టైల్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కలిశారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. కేంద్రమంత్రిని పోచంపల్లి శాలువాతో సత్కరించారు. తెలంగాణ ఇక్కత్ డిజైన్లకు ప్రసిద్ధి అని, మార్కెట్‌లో అసలు ఇక్కత్ చీరలు రూ.8వేల ధర ఉండగా ప్రింటెడ్ ఇక్కత్ చీరలు కేవలం రూ.300కు లభిస్తుండటంతో చేనేత కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. నేతన్నలకు భరోసా కల్పించేలా ప్రింటెడ్ చీరల ఉత్పత్తి, విక్రయాలపై నియంత్రణ విధించాలని కోరారు.

ఐదు నుంచి స్వచ్ఛదనం, పచ్చదనం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

జగిత్యాల: ఈనెల ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. 5న పచ్చదనం, స్వచ్ఛదనం, ఆరున తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురికి కాలువలు, నీటి నిలువ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు, 9న డ్రైడే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీలు, గెజిటెడ్ అధికారులు, ప్రత్యేకాధికారులను నియమించాలని ఆదేశించారు. కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా జెడ్పీ సీఈవో, డీఆర్డీవోలు, డీపీవోలు పర్యవేక్షించాలని, కలెక్టర్ రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్డీఏ పీడీ సంపత్‌రావు, రఘువరణ్ ఉన్నారు.

30 మంది బాలకార్మికులకు విముక్తి

జగిత్యాలక్రైం: జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతమైందని, 30 మంది బాలకార్మికులకు విముక్తి లభించిందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏడాదికి రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తోంది. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం ఒక్కో సబ్‌డివిజన్ పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుల్‌ను కేటాయించి చైల్డ్‌లైన్‌తో బృందాలను ఏర్పాటు చేసి స్వచ్ఛంద సంస్థలతో తనిఖీలు చేశామని, జూలై ఒకటి నుంచి 31 వరకు 30 మంది బాలకార్మికులను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పర్చామని పేర్కొన్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్నా.. ఎక్కడైనా పనిచేస్తున్నా.. తప్పిపోయిన పిల్లల సమాచారం తెలిస్తే 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.

ప్యాకేజీలుగా 'ఎన్‌హెచ్ 563'

- జగిత్యాల-గంగాధర 28 కి.మీ.కు రూ.848 కోట్లు
- గంగాధర-కరీంనగర్ బైపాస్ వరకు 30.9 కి.మీ.కు రూ.893 కోట్లు
- డిసెంబర్ లేదా జనవరిలో ఫోర్‌లేన్ రహదారి పనులు ప్రారంభం
- పలు సివిల్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేస్తున్నట్లు సమాచారం



గట్టుదుద్దెనపల్లి వద్ద టోల్‌గేట్ పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రతిష్టాత్మక ఎన్‌హెచ్-563 జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ ఫోర్ లేన్ రహదారి పనులకు దేశవ్యాప్తంగా పలు సివిల్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేస్తున్నట్లు సమాచారం. వచ్చే నెలలో అధికారులు టెండర్లు ఓపెన్ చేసి, ఖరారు చేయనున్నారు. డిసెంబర్ లేదా జనవరిలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ముందస్తుగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకుసాగుతున్నారు. ఇప్పటికే ఈ పనులపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యవేక్షణ చేస్తున్నారు. వరంగల్-కరీంనగర్ సెక్షన్‌లో ఇప్పటికే పనులు ఊపందుకున్నాయి. అయితే, పలుచోట్ల న్యాయ వివాదాల కారణంగా కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాటిని ఇటీవల కోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో వారంతా తిరిగి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిసింది.

పని విభజన..

తాజా సమాచారం ప్రకారం.. ఈ రహదారిలో రెండు కీలక (వరంగల్-కరీంనగర్ సెక్షన్ 68 కి.మీ., కరీంనగర్-జగిత్యాల సెక్షన్ 58.9 కి.మీ.) సెక్షన్లు ఉన్నాయి. జగిత్యాల-కరీంనగర్ సెక్షన్‌లో పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటిది జగిత్యాల నుంచి గంగాధర వరకు 28 కి.మీ. దూరం. దీన్ని పూర్తి చేయడానికి రూ.848.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. రెండోది గంగాధర-కరీంనగర్ బైపాస్ (కొత్తపల్లి శివారు) వరకు 30.9 కి.మీ. దూరం. దీన్ని పూర్తి చేసేందుకు రూ.893.79 కోట్లు వెచ్చించనున్నారు. మొత్తంగా ఒకే సెక్షన్‌లోని పనులను విభజించి, రెండు కంపెనీలకు టెండర్లు ఇవ్వాలన్నది అధికారుల వ్యూహంగా కనిపిస్తోంది. రహదారి పనులు వచ్చే ఏడాది జూలై 16వ తేదీ నాటికి పూర్తి చేయాలన్న సంకల్పంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఉన్నారు. డిజైన్, బిల్ట్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీవోటీ) విధానంలో రోడ్డు నిర్మాణం చేపడతారు.

పూడూరు సమీపంలో టోల్‌గేట్..

కరీంనగర్-జగిత్యాల సెక్షన్‌లో ఇప్పటికే టెండర్లు తెరుచుకున్నాయి. మొత్తం 58.9 కి.మీ. మేర రహదారికి రూ.222,7 కోట్లు ఖర్చవనుంది. ఇందులో భూసేకరణకు కోసం రూ.387.15 కోట్లు వెచ్చించనున్నారు. వాస్తవానికి ఈ రహదారి నిర్మాణ అంచనా వ్యయం రూ.1,503.73 కోట్లు మాత్రమే. దీనికి జీఎస్టీ, భూసేకరణ కలుపుకొని రూ.2,227 కోట్లకు చేరింది. ఈ క్రమంలో పూడూరు సమీపంలో టోల్‌గేట్ నిర్మిస్తున్నారు. తొలుత గంగాధర సమీపంలో నిర్మిస్తారని ప్రచారం జరిగింది. టోల్‌గేట్ సమీపంలో ఇరువైపులా ట్రక్కులు ఆగేలా ట్రక్ బే, రెస్ట్ ఏరియాలు నిర్మించనున్నారు. 24 బ్రిడ్జిలు (18 మైనర్, 06 మేజర్), 03 ఆర్వోబీ/ఆర్‌యూబీ, 27 మేజర్ జంక్షన్లు, 29 మైనర్ జంక్షన్లు కూడా నిర్మించనున్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నిరసన



నిరసనలో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, వల్లెం మల్లేశం, సమ్మిళ్ల శ్రీనివాస్ తదితరులు

జగిత్యాలటౌన్: బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు జిల్లాకేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తాలో నిరసనకు దిగారు. బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిని ఉద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని, ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, వల్లెం మల్లేశం, సమ్మిళ్ల శ్రీనివాస్, ఆవారి శివకేసరి బాబు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సరుకులు పక్కదారి



ఆయాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీడీపీవో వాణిశ్రీ

వెల్గటూర్ : ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం నుంచి అందించే సరుకులు పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని సీడీపీవో వాణిశ్రీ హెచ్చరించారు. మండలంలోని కప్పారావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులు పక్కదారి పడుతున్నాయన్న ఫిర్యాదు మేరకు గురువారం విచారణ చేపట్టారు. చాలారోజులుగా కేంద్రంలో గుడ్లు, బాలామృతం, పప్పులు, నూనెలను బయటకు తరలిస్తున్నారని తేలడంతో గతంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలికి మెమో జారీ చేశారు. అయితే సీడీపీవో విచారణలో ఆయా సరుకులు పక్కదారి పట్టించినట్లు తేలిందన్నారు. ఈనెల ఒకటో తేదీన 2,071కు కేవలం 435 ఉన్నాయని, పప్పు 20కిలోలు, నూనె ఎనిమిది కిలోలు, కుర్‌కురే 10 కిలోలు పక్కదారి పట్టించినట్లు తేలిందన్నారు. సరైన పర్యవేక్షణ చేయకపోవడంపై సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుకులను రికవరీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శానిటేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న గౌతంరెడ్డి

జగిత్యాల: జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో శానిటేషన్ చర్యలు తప్పనిసరి చేయాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శానిటేషన్‌పై గురువారం అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. వర్షకాలంలో అంటువ్యాధులు కలుషిత నీటితో వచ్చే అవకాశం ఉందని, దీనిపై ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వారానికో గ్రామాన్ని సందర్శించాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్త తరలించాలని సూచించారు. చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో గల్ఫ్ కార్మికుడు మృతి


పెండ్యాల శ్రీకాంత్ (ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన గల్ఫ్ కార్మికుడు పెండ్యాల శ్రీకాంత్(55) అనారోగ్యంతో అబుదాబిలో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధి కోసం వెళ్తున్న ఆయన అక్కడే ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో జూలై 29న ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంగీతో మహిళ మృతి

- మర్రిగడ్డలో విషాదం


అంజలి(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన గజవాడ అంజలి(53) డెంగీతో గురువారం మృతిచెందింది. అంజలి ఐదు రోజుల క్రితం అనారోగ్యం బారిన పడగా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి డెంగీతోపాటు ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని తెలిపారు. దీంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలుకు భర్త జనార్దన్, కూతురు, కుమారుడు ఉన్నారు.

కథలాపూర్‌లో ఒకరికి డెంగీ

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన ఎల్లాల దేవారెడ్డికి డెంగీ పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి సింధూజ తెలిపారు. దేవారెడ్డి రెండురోజులుగా జ్వరంతో బాధపడుతూ కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స కోసం వెళ్లాడు. రక్తపరీక్షలు చేయగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. గురువారం బాధితుడికి ప్రత్యేక చికిత్స చేసి మందులు అందించినట్లు వైద్యాధికారి పేర్కొన్నారు.

విద్యార్థికి..

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన మీస రోహిత్ డెంగీతో బాధపడుతున్నాడని వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. సిద్దిపేట జిల్లా పాలమాకుల మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రోహిత్‌కు హాస్టల్‌లో ఉండగానే జ్వరం బారిన పడ్డాడు. తల్లిదండ్రులు గురువారం పోతుగల్ పీహెచ్‌సీకి తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. రోహిత్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. రోహిత్ ఇంటి వద్ద గురువారం వైద్యసిబ్బంది దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు.

మాతాశిశు కేంద్రం సేవలెప్పుడో..

- పూర్తి దశకు చేరిన పనులు
- బిల్లులు రాక అప్పగించని కాంట్రాక్టర్
- సిబ్బందిని నియమిస్తేనే సేవలకు మోక్షం
- ఇదీ ధర్మపురి ఆస్పత్రి దుస్థితి


పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ధర్మపురిలోని మాతాశిశు ఆస్పత్రి


మాతాశిశు ఆస్పత్రి

ధర్మపురి: రూ.10.50కోట్లతో ధర్మపురిలో నిర్మించిన ఎంసీహెచ్ (మాతాశిశు కేంద్రం) ఆస్పత్రి సేవలకు నోచుకోలేకపోతోంది. వేసిన రంగులు వెలిసిపోతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ కేంద్రాన్ని ఎన్నికల కోడ్ వస్తుందని ఆగమేఘాల మీద ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు కాంట్రాక్టర్ సదరు భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించలేదు. సిబ్బందిని కూడా నియమించకపోవడంతో ఆస్పత్రి సేవలు అందించలేకపోతోంది. ఈ రెండు సమస్యలు తీర్చితే ఆస్పత్రికి మోక్షం కలుగుతుంది. తల్లీబిడ్డల సంరక్షణకు ధర్మపురి నియోజకవర్గ ప్రజలు జగిత్యాలకు వెళ్లకుండా ధర్మపురిలో రూ.8.50కోట్లతో 50 పడకల మాతాశిశు ఆస్పత్రికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిధులు సరిపోకపోవడంతో అదనంగా మరో రూ.రెండు కోట్లు మంజూరు చేసింది. ధర్మపురిలోని కస్తూరిబా గురుకులం పాఠశాల వెనుక 2022 మేలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని సౌకర్యాలు, హంగులతో నిర్మించారు. మొదటి అంతస్తులో అన్ని పనులు పూర్తయ్యాయి. రెండో అంతస్తులో 90శాతం పనులు పూర్తయ్యాయి. కొన్ని పరికరాలు ఆస్పత్రికి చేరాయి. అయితే వాటి వినియోగం లేక ప్రస్తుతం తుప్పు పడుతున్నాయి.

అక్టోబర్‌లోనే ప్రారంభం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కోడ్ వస్తుందన్న ఆలోచనతో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 2023 అక్టోబర్ 3న లాంఛనంగా ప్రారంభించారు. ఆ నెల చివరివరకే పనులు పూర్తి చేసి సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని అధికార వర్గాలు ప్రకటించాయి. అయితే ఆస్పత్రిని ప్రారంభించి 10నెలలు కావస్తున్నా సేవలకు మాత్రం నోచుకోలేకపోతోంది.

ఆస్పత్రిలో వసతులు ఇలా..

గ్రౌండు ఫ్లోర్‌లో మొత్తం ఎనిమిది గదులున్నాయి. వాటిలో ఓపీ బ్లాక్, ప్రసూతి గది, ట్రమేజ రూం (డెలివరీ తీవ్రతను బట్టి నిర్ధారించే గది), మత్తు మందు గది, ఈసీజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, గైనకాలజిస్ట్ గదులు ఉన్నాయి.

ఫస్ట్ ఫ్లోర్‌లో: మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో సెప్టిక్ ఓటీ, మేజర్ ఓటి గదులు నిర్మించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 50బెడ్లతో నిర్మాణం చేపట్టారు. వాటిలో 40 బెడ్లు గర్భిణులు కోసం, 10 నవజాత శిశువుల కోసం ఏర్పాటు చేశారు.

ప్రారంభమెప్పుడో..

ఎంసీహెచ్ ఆస్పత్రికి పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో టీఎస్ఎంఐడీసీ వారు ఆస్పత్రిని ఇంకా ప్రభుత్వానికి అప్పగించలేదు. వైద్య సిబ్బంది కోసం వైద్య విధాన పరిషత్‌కు నివేదిక పంపించారు. సిబ్బందిని నియమిస్తేనే సేవలు అందుబాటులోకి వస్తాయని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆస్పత్రిని అప్పటి ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిందన్నారు.

గురుకులం విద్యార్థులు సేఫ్

- ఆస్పత్రి నుంచి ఇద్దరు పిల్లల డిశ్చార్జి
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు, అధికారులు


ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి చేరిన విద్యార్థి గణేశ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో జూలై 25న అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మూడురోజుల క్రితం హర్షవర్ధన్.. బుధవారం సాయంత్రం గణేశ్‌ను డిశ్చార్జి చేశారు. ఈ ఇద్దరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. గురుకులంలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురై ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన జిల్లా అధికార యంత్రాంగం వారి ఆరోగ్య పరిస్థితిపై దృష్టి సారించింది. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో సమియోద్దీన్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, ఇతర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించారు. మొదట మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌లోని నిమ్స్ తరలించారు.

హైదరాబాద్‌కు తరలించాకే...

నిజామాబాద్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఒక దశలో అధికార యంత్రాంగం తీవ్రంగా ఆందోళన చెందింది. వెంటనే అప్రమత్తమై మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. వైద్యాధికారులు విద్యార్థుల వెంట హైదరాబాద్ వెళ్లారు. నిమ్స్‌కు తరలించాకే విద్యార్థులు ఆరోగ్యం మెరుగుపడింది.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విషయంలో తీవ్రంగా ఆందోళన చెందిన అధికారులు ప్రస్తుతం ఊపిరి పీల్చుకున్నారు. అస్వస్థతకు గురైన ఇద్దరు డిశ్చార్జి కావడంతో వారి కృషి ఫలించినట్లైంది.

గురుకులం పాఠశాల పరిశీలన

గురుకులం పాఠశాలను ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు గురువారం పరిశీలించారు. ఘటనపై ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డితో ఆరా తీశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, మెట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు తుక్కారం, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు శోభన్, మెట్‌పల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్ ఉన్నారు.

అటవీ శాఖలో పలువురి బదిలీలు

- కరీంనగర్ ఎఫ్ఆర్‌వోగా షౌకత్ హుస్సేన్

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో)గా షౌకత్ హుస్సేన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఎఫ్ఆర్వోగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసింది. అలాగే, గంగాధర డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కిరణ్మయిని స్ట్రైకింగ్ ఫోర్స్‌కు కేటాయించగా, ఆమె స్థానంలో సిరిసిల్ల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాపిరాజును నియమించింది. చొప్పదండి ఎఫ్ఎస్‌వో భరణిని కామారెడ్డి బదిలీ చేసింది.

సీపీవో కార్యాలయంలో..

సీపీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ ఎస్‌వోలు శ్రీనివాస్ హైదరాబాద్‌కు, సంపత్ సిద్దిపేటకు, రాంప్రసాద్‌రెడ్డి సెక్రటేరియట్‌కు, జమ్మికుంట ఎంపీఎస్‌వో హైమావతి హైదరాబాద్‌కు, సీనియర్ అసిస్టెంట్ సునంద సిరిసిల్లకు, జ్యోతి(కరీంనగర్ ఆర్డీవో ఆఫీస్)ను సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌కు, ఉమారాణి(హైదరాబాద్), అంజయ్య(సిరిసిల్ల)లను కరీంనగర్ సీపీవో కార్యాలయానికి బదిలీ చేశారు. వాసుదేవరెడ్డి(హైదరాబాద్)ని కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్ హేమలత(సిరిసిల్ల)ను కరీంనగర్‌కు, ఎంపీఎస్‌వో రమేశ్(సిరిసిల్ల)ను జమ్మికుంటకు కేటాయించారు.

సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్ యజమాని అరెస్ట్

- రూ.3.10 కోట్ల విలువైన బియ్యం పక్కదారి
- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ రఘు చందర్

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకుని.. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్ యజమానిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. పెగడపల్లి శివారులోని హరిహర రైస్‌మిల్ యజమాని గంగం వెంకట్‌రెడ్డి సివిల్ సప్లై కార్పొరేషన్‌తో ధాన్యాన్ని బియ్యంగా మార్చి అప్పగించేందుకు 2022–23 సంవత్సరానికి గాను ఒప్పందం చేసుకున్నాడు. సుమారు రూ.3,10,82,310 విలువైన 12,728.74 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. అక్రమాలకు పాల్పడినట్లు కార్పొరేషన్ జిల్లా మేనేజర్ వి.హథిరామ్ పెగడపల్లి ఎస్సై రవికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా నిబంధనలు ఉల్లంఘించి, సీఎంఆర్‌లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో మిల్లు యజమానిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్సై సీహెచ్. రవికిరణ్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు


గాయాలతో చిన్నారి హజారా బేగం

రాయికల్: రాయికల్‌లో గురువారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఆరేళ్ల చిన్నారి హజారే బేగం, బద్దం రమ, తోకల లక్ష్మీనర్సయ్య, చిర్ర రమేశ్‌పై దాడి చేశాయి. వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి వ్యాక్సినేషన్ వేయించారు. ఒకే రోజు నలుగురిపై కుక్కలు దాడి చేయడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

కోతులదాడిలో వృద్ధురాలికి గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన వృద్ధురాలు సిర్రం మల్లవ్వ(65) గురువారం తీవ్రంగా గాయపడింది. కోతుల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో కింద పడి పోవడంతో మోకాలు తుంటి విరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో రోజురోజుకు కోతుల బెడద తీవ్రమవుతుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం


గుండు అంజయ్య (ఫైల్)

గంగాధర: కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని వెంకటాయపల్లికి చెందిన గుండు అంజయ్య (40) గురువారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామంలోని స్టేజీ వద్ద కేబుల్ వైర్ సరిచేసేందుకు అంజయ్య పోలు ఎక్కుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈయన కూతురు గతేడాది స్కూల్‌డే రోజు డ్యాన్స్‌చేస్తూ గుండెపోటుతో మృతిచెందింది. అంజయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ వైద్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పెండెం గోపి అనే రోగి శస్త్రచికిత్సను నిర్లక్ష్యం చేయడంతోపాటు ఇదేంటని అడిగినందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురు వైద్యులు, ఐదుగురు సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన గోపి కాలులో ఉన్న రాడ్‌ను తీయించుకునేందుకు జూన్ 25న జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. శస్త్రచికిత్స సమయంలో వైద్యులు వెన్నుభాగంలో మత్తుమందు ఇచ్చి వైద్యుడు సెల్‌ఫోన్ చూస్తూ ఉండిపోయాడు. మహిళా డాక్టర్ వచ్చి సదరు డాక్టర్‌ను మందలించి మళ్లీ నడుం భాగంలో మత్తు మందు ఇచ్చారు. శస్త్రచికిత్స సమయంలో కింద ఉన్న కరెంట్ వైర్లు కుడి చేయికి షాకిచ్చాయని, చర్మం కాలిపోతోందని మొరపెట్టుకున్నా వైద్యులు నిర్లక్ష్యంగా సర్జరీ చేశారు. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుందని చెప్పినా ఆక్సిజన్ పెట్టకుండా నరకయాతన చూపారు. సర్జరీ గది నుంచి బయటకు వచ్చిన తర్వాత రోగి మామ కంటె నర్సయ్య వైద్యులను ప్రశ్నిస్తే కులం పేరుతో దూషించారని బాధితులు వైద్యులు శంబు, వికాస్, నవీన్, రాములు, ప్రణీష, హరికృష్ణ, రాహుల్, సిబ్బంది తిరుపతి, ఎండీ.బాబా, బెజ్జంకి సతీశ్, సంజీవ్, జుంబర్తి భిక్షుపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు.

'ఇన్‌స్టా'.. ఇంటికి చేర్చింది

- మతిస్థిమితం లేక రోడ్లపైనే జీవనం
- బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం
- చికిత్స అందించి కుటుంబ సభ్యుల చెంతకు..


రమేశ్‌ను కటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, షెల్టర్ మేనేజర్ మమత

విశాఖవిద్య(ఆంధ్రప్రదేశ్): మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వచ్చేసిన వ్యక్తి నాలుగు నెలల తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించడంతో బంధువులు పట్టరాని ఆనందంలో మునిగితేలారు. విశాఖలోని జీవీఎంసీ షెల్టర్‌లో ఉన్నాడని తెలుసుకున్న వారు జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి వార్డు కౌన్సిలర్ సహాయంతో గురువారం ఇక్కడకు వచ్చారు. అతన్ని తమ వెంట తీసుకెళ్లారు. నాలుగు నెలల కిందట గాజువాక సింథియా సమీపంలో ఓ వ్యక్తి మతిస్థిమితం లేక.. ఫుట్‌పాత్‌పై తిరుగుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడకు చేరుకుని.. అతనికి సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. రమేష్ అని తప్పితే.. మినహా మరే ఇతర వివరాలు చెప్పకపోవడంతో షెల్టర్‌లోనే ఆశ్రయం కల్పించారు. మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. తర్వాత హైదరాబాద్‌లో తెలిసిన వ్యక్తి ప్రేమ్‌కుమార్ సాయంతో రమేష్ వివరాలను షెల్టర్ మేనేజర్ మమత ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేయించారు. రమేశ్ కుటుంబ సభ్యులు దీన్ని చూసి ఆమెకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కానీ వారు వైజాగ్ వచ్చి రమేష్ తీసుకువెళ్లడానికి ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో అక్కడి కౌన్సిలర్ సూర్యనారాయణకు విషయాన్ని తెలియజేశారు. దీనిపై స్పందించి రమేష్‌ను తీసుకెళ్లేందుకు వారితో సహా ఆయన గురువారం విశాఖ వచ్చారు. పోలీసులు సమక్షం రమేష్ తమ కుటుంబ సభ్యులును గుర్తు పట్టాడు. దీంతో జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు సమక్షంలో రమేష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. తప్పిపోయిన ఎంతో మంది అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తూ.. వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా శ్రద్ధ తీసుకుంటున్న అధికారులకు కౌన్సిలర్ సూర్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోదావరిఖని: పట్టణంలోని రమేశ్‌నగర్‌లో అక్రమంగా నిల్వచేసిన 4.27క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 13 గృహ సిలిండర్లను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం రమేశ్‌నగర్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. టి.సత్యం అనే వ్యక్తి వద్ద 4.27 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న రెండు గ్యాస్ సిలిండర్లను, అదే సమయంలో రాజవీరు అనేవ్యక్తి వద్ద 11 గ్యాస్ సిలిండర్లు పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన


యువకులను చితకబాదుతున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని దేవునిగోవిందుపల్లిలో నివాసముంటున్న ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులను స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. దేవునిగోవిందుపల్లిలో ఓ మహిళ అద్దెకుంటోంది. గురువారం సాయంత్రం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికులు వారిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.

ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఎస్‌వోఎఫ్ నిర్వహించిన అంతర్జాతీయ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, పతకాలు, నగదు బహుమతి సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. డి.స్తుతి (ఎనిమిదో తరగతి), బి.యశ్వంత్ కృష్ణ, మాజ్ హుస్సేన్(తొమ్మిదో తరగతి), బి.కార్తికేయ (ఐదోతరగతి)లు పతకాలతోపాటు రూ.500 నగదు బహుమతి గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

డెంగీపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ బాలికల ఈటెక్నో స్కూల్‌లో గురువారం సైన్స్ విభాగం ఉపాధ్యాయులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్ అవిష్కరించారు. డెంగీ భయంకరమైనదని, ప్రాణహాని కలిగిస్తుందని తెలుపుతూ ఈ వ్యాధి సోకినవారు సరైన వైద్యం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు వ్యాప్తిచెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో దృశ్యమాలికల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుగ్గారం ఏఎస్సై సస్పెన్షన్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై లక్ష్మీనారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. బుగ్గారం ఎస్సైతో పాటు తోటి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను సస్పెండ్ చేస్తూ గురువారం మల్టీ జోన్ –1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

'పారమిత'లో స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న హెచ్‌ఎంలు, విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రశాంత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, స్కౌట్స్ జెండా ఎగురవేసి, వేడుకలను ప్రారంభించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ సమాజ సేవకు సిద్ధంగా ఉంటాం అనే నినాదంతో ప్రజలకు సేవ చేస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి శిక్షణ తీసుకొని, విలువలతో కూడిన జీవితాన్ని గడుపుతూ దేశ సేవ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, వి.యు.ఎం.ప్రసాద్, టీఎస్వీ.రమణ, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత, కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల వంటావార్పు


రోడ్డుపై అల్పాహారం తింటున్న కార్మికులు

గంగాధర(చొప్పదండి): తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ గర్శకుర్తి చేనేత కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు వంటావార్పుతో నిరసన తెలిపారు. దీక్ష చేస్తున్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి చేసిన చీరలు అమ్ముడుపోక, కొత్తగా వస్త్ర తయారీకి ఎటువంటి ఆర్డర్లు లేక పస్తులుండే పరిస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి, తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గడ్డం నారాయణ, అలువాల విఠోభ, అన్నల్‌దాస్ శ్రీనివాస్, రేణికుంట శ్రీనివాస్, సామల శంకర్, కొలిపాక తిరుపతి, అలువాల శ్రీశైలం, వెంకటేశ్, బూర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్


గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ యువకులను అరెస్టు చూపుతున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను చందుర్తి మండలం మూడపల్లి శివారులో సీఐ వెంకటేశ్వర్లు గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మూడపల్లి శివారులో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లెకు చెందిన చీకుంట గణేశ్, కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చిట్యాకరి ఈశ్వర్ పట్టుబడ్డారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.